క్లుప్తంగా

జాబ్ మేళాలో 40 మందికి ఉద్యోగాలు



నగరం: తీర ప్రాంతంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో జాబ్ మేళా నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్యచౌదరి చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. 17 మల్టీనేషనల్ కంపెనీల ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించినట్లు తెలిపారు. జాబ్‌మేళాకు 350 మంది హాజరు కాగా 40 మందిని కంపెనీల ప్రతినిధులు ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి 2024–25 పరీక్ష ఫలితాల అనంతరం నియామక పత్రాలను అందజేయనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, ఎస్వీకే ప్రసాద్, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. యువకుడు మృతి



మృతుడు చినబాబు (ఫైల్)

నగరం: ఆటో బోల్తా పడిన ఘటనలో యువకుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రమైన నగరంలో శుక్రవారం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు రేపల్లె నుంచి నగరం వెళుతున్న ఆటో నగరం శివారు ప్రాంతంలో బోల్తా పడింది. నగరం గ్రామానికి చెందిన ఆసోది చినబాబు(28)పాటు మరో ఇరువురు ఆటోలో ప్రయాణిస్తున్నారు. ఆటో బోల్తా పడటంతో చినబాబుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు హుటాహుటిన నగరం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడ నుంచి తెనాలి తరలిస్తుండగా చినబాబు మృతి చెందాడు. ఆటో డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తికి గాయాలయ్యాయి. చినబాబు ఆటో ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి భార్య, ఇరువురు కుమారులు ఉన్నారు. చినబాబు రోజు కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఘటనపై మృతుని సోదరుడు కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భార్గవ్ తెలిపారు.

ఎస్ఐ రవీంద్రను అభినందించిన ఎస్పీ



కర్లపాలెం: కర్లపాలెం ఎస్ఐ రవీంద్రను బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ శుక్రవారం తన కార్యాలయంలో అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ఎస్ఐ రవీంద్ర లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు రాజీ కుదర్చటంలో విశేషంగా కృషి చేసి ఎక్కువ కేసులు పరిష్కరించినందుకు ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రం అందజేశారు. ప్రశంసాపత్రం అందుకున్న కర్లపాలెం ఎస్ఐ రవీంద్రకు బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ, స్థానిక సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆది, సోమవారాల్లోనూ కౌంటర్లు

తెనాలి అర్బన్: పన్నులు చెల్లించాల్సిన వారి సౌకర్యార్థం ఆది, సోమవారాల్లో కౌంటర్లు పని చేస్తాయని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. కార్యాలయంలోని తన చాంబర్‌లో శుక్రవారం సాయంత్రం సచివాలయ, రెవెన్యూ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీతో పన్నుల చెల్లింపు ముగియనున్నట్లు చెప్పారు. ఆ తర్వాత చెల్లించే వారిపై అపరాధ రుసుం విధిస్తామని తెలిపారు. బకాయిదారులను గుర్తించి వారితో పన్నులు చెల్లించే విధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో ఆర్వో రాంప్రసాద్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

శానిటేషన్ ఉద్యోగులకు సన్మానం

తెనాలి అర్బన్: ఇటీవల నిర్వహించిన స్వచ్ఛ తెనాలి చాలెంజింగ్ పోటీల్లో 11వ వార్డు శానిటేషన్ ఉద్యోగులు 2వ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ కఠారి రత్నకుమారి, హరీష్ దంపతులు శుక్రవారం వార్డులో వారిని సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ వై.అనుపమ, శానిటరీ సెక్రటరీలు సాగరయ్య, హవేలా ప్రియ, నగర దీపిక వి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

ముగిసిన సదరం క్యాంప్

తెనాలి అర్బన్: దివ్యాంగుల ధ్రువ పత్రాలను పునః పరిశీలన జరిపే కార్యక్రమంలో భాగంగా తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ శుక్రవారంతో ముగిసింది. ఆర్థో, ఈఎన్‌టీ, సైక్రాటిక్ విభాగాలకు చెందిన వికలాంగులు వైద్యశాలకు వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్య వాణి పర్యవేక్షించారు.



చెరుకుపల్లి తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున, రేపల్లె సమన్వయకర్త డాక్టర్ గణేష్, తదితరులు



తుమ్మలపాలెంలో మిర్చి తోటలో రైతులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున, రేపల్లె సమన్వయకర్త డాక్టర్ గణేష్, తదితరులు



మాట్లాడుతున్న డాక్టర్ మేరుగ నాగార్జున, వేదికపై వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

కూటమి పాలనలో దగా పడుతున్న రైతాంగం

రేపల్లె రూరల్: రైతులను ఆదుకోవటంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మేరుగ నాగార్జున తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పచ్చిమిర్చి రైతుకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం చెరుకుపల్లిలో నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గుళ్ళపల్లి పార్టీ కార్యాలయం నుంచి తుమ్మలపాలెం గ్రామం ర్యాలీగా వెళ్లి మిర్చి పొలాల్లో రైతులతో మాట్లాడి వారికి భరోసానిచ్చారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దార్ పద్మావతికి వినతిపత్రం అందజేశారు.



హాజరైన మిర్చి రైతులు, ప్రజలు



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

ప్రభుత్వానికి నై.. ప్రైవేటుకు జై

- తూతూ మంత్రంగా పెసర, మినుము కొనుగోళ్లు
- మార్క్‌ఫెడ్ నిబంధనలతో అమ్మకానికి ఆసక్తి చూపని రైతులు

అమర్తలూరు మండలంలో మార్క్‌ఫెడ్ ద్వారా మినుము, పెసర పంటలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే కొనుగోలుకు మార్క్‌ఫెడ్ అధికారుల నిబంధనలతో రైతులు అమ్మకానికి ముందుకు రావడం లేదు. ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రైవేటు వ్యాపారస్తులు కొనుగోలు చేస్తుండడంతో రైతులు వాళ్లకే జై కొడుతున్నారు. అంతేకాక ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడంలో జాప్యం చేయడం కూడా మరో కారణంగా రైతులు చెబుతున్నారు.

అమర్తలూరు(వేమూరు): మినుము, పెసర కొనుగోలు చేసేందుకు మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మినుము, పెసర కొనుగోలులో మార్క్‌ఫెడ్ అధికారులు కొన్ని నిబంధనలు పెట్టడంతో రైతులు అమ్ముకునేందుకు ముందుకు రావడం లేదు. దీంతో మార్క్‌ఫెడ్ అధికారులు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలు తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ఆదివారం అమర్తలూరు మండల కేంద్రంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. కానీ రైతులు కొనుగోలు కేంద్రంలో మినుములు అమ్మిన దాఖా లాలు లేవు. పెసర మాత్రం రైతులు 12 క్వింటాళ్లు అమ్మినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం పట్ల రైతులు శ్రద్ధ చూపించడం లేదని మార్క్‌ఫెడ్ అధికారులు తెలుపుతున్నారు. పంట చేతికి రాక ముందే ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించాల్సి ఉందని, కానీ ప్రభుత్వం జాప్యం చేసిందని అప్పటికే కొంత మంది రైతులు పంట అమ్ముకున్నారని రైతులు చెబుతున్నారు.



అమర్తలూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం

మార్క్‌ఫెడ్ నిబంధనలు ఇలా...

మార్క్‌ఫెడ్ అధికారులు మినుము, పెసర కొనుగోలు చేయాలంటే కొన్ని నిబంధనలు ఏర్పాటు చేశారు. నిబంధనలు ప్రకారం ఉంటే మినుము, పెసర కొనుగోలు చేయడం జరుగుతుందని అధికారులు చెబుతున్నారు.

- మినుము, పెసరకు తేమ 12 శాతం ఉండాలి, ఇతర వ్యర్థ పదార్థాలు 2 శాతం, ఇతర తినదగిన గింజలు 1 శాతం, ఇంతర పంట గింజలు 3 శాతం, ముతక, పూర్తిగా తయారు కాని గింజలు 3 శాతం, పాక్షికంగా దెబ్బతిన్న రంగు మారిన, విరిగిన, పురుగు కుట్టిన గింజులు 3 శాతం లోపు ఉంటే కొనుగోలు చేయడం జరుగుతుందని మార్క్‌ఫెడ్ అధికారులు తెలిపారు.
- దీంతో రైతులు మినుము, పెసర ప్రభుత్వానికి అమ్ముకునేందుకు ముందుకు రావడం లేదు. ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రైవేటు వ్యాపారస్తులు పెసర క్వింటా రూ.7,400, మినుము రూ.7,000కు కొనుగోలు చేస్తున్నారు.
- మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారం ఉంటే పెసర క్వింటా రూ.8,682, మినుము రూ.7,400కు కొనుగోలు చేస్తున్నారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వైపు మొగ్గు చూపడం లేదు.

దీంతో కొనుగోలు కేంద్రాలు వెలవెలబోతూ తూతూ మంత్రంగా కొనసాగుతున్నాయి.

నిబంధనలు లేకుండా కొనుగోలు చేయాలి



రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన మినుము, పెసర పంటలను ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలి. అప్పుడే రైతులకు గిట్టుబాటు కలుగుతుంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన తేమ నిబంధనలు వల్ల రైతులు ముందుకు రావడం లేదు.

– అమర్తలూరు వెంకయ్య, అమర్తలూరు

అమ్ముకున్న తర్వాత కొనుగోలు కేంద్రాలు



రైతులు మినుము, పెసర పంటలు ప్రైవేటు వ్యాపారస్తులకు అమ్ముకున్న తర్వాత ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. పంటలు చేతికి రాక ముందు ప్రభుత్వం పద్దతు ధర ప్రకటించాలి. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించక పోవడంతో రైతులు అమ్ముకున్నారు.

– తెనాలి పవన్ కళ్యాణ్, పెదపూడి, అమర్తలూరు మండలం

ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలి

రేపల్లె ఆర్టీసీ డిపో మేనేజర్ సునీల్‌కుమార్

రేపల్లె రూరల్: రేపల్లె ఆర్టీసీ డిపో నుంచి బీహెచ్‌ఈఎల్ (హైదరాబాద్)కు నడుపుతున్న ఆర్టీసీ సర్వీసులకు వేమూరు, అమృతలూరులలో స్టేజ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్.సునీల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం ఆయన మాట్లాడారు. రేపల్లె డిపో నుంచి బీహెచ్‌ఈఎల్‌కు వయా వెల్లటూరు, తెనాలి, విజయవాడల మీదగా నడిపే సూపర్‌లగ్జరీ, ఇంద్ర బస్ సర్వీసులకు వేమూరులో ప్రయాణికుల సౌకర్యార్థం స్టేజీను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రేపల్లె నుంచి బీహెచ్‌ఈఎల్‌కు 4703 నంబరు సూపర్ లగ్జరీ బస్సు వేమూరులో రాత్రి 9.50 గంటలకు, బీహెచ్‌ఈఎల్ నుంచి రేపల్లెకు 4704 నంబరు సూపర్ లగ్జరీ బస్సు రాత్రి 7.10 గంటలకు ఆగుతాయన్నారు. రేపల్లె నుంచి బీహెచ్‌ఈఎల్‌కు 4320 నంబరు ఇంద్ర బస్సు వేమూరులో రాత్రి 8.25 గంటలకు, బీహెచ్‌ఈఎల్ నుంచి రేపల్లెకు 4340 నంబరు ఇంద్ర బస్సు రాత్రి 9.30 గంటలకు ఆగుతాయన్నారు. అదేవిధంగా రేపల్లె నుంచి నగరం, చెరుకుపల్లి, తెనాలి మీదగా బీహెచ్‌ఈఎల్‌కు నడుపుతున్న సూపర్ లగ్జరీ సర్వీసుకు అమృతలూరులో రిక్వెస్ట్ స్టేజ్‌గా ఏర్పాటు చేశామన్నారు. రేపల్లె నుంచి బీహెచ్‌ఈఎల్‌కు నడిపే 4727 నంబరు సర్వీసు రాత్రి 8.30 గంటలకు అమృతలూరులో, బీహెచ్‌ఈఎల్ నుంచి రేపల్లెకు 4728 నంబరు సర్వీసు రాత్రి 8.15 గంటలకు నిలుపబడునన్నారు. ప్రయాణికులు ఆన్‌లైన్ ద్వారా గానీ, సమీప బస్టాండ్‌లో గానీ, బుకింగ్ ఏజెంట్ ద్వారా గానీ టిక్కెట్లను రిజర్వు చేసుకోవచ్చన్నారు. వేమూరు, అమృతలూరు పరిసర ప్రాంత ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థి దశలోనే సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలి

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ వీరరాఘవయ్య

రేపల్లె రూరల్: విద్యార్థి దశ నుంచే సేవా దృక్పథాన్ని అలవరుచుకోవాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచ్ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సేవా కార్యక్రమాలలో పాల్గొనే విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు అలవడటంతో పాటు గుర్తింపును పొందవచ్చన్నారు. చదువుతో పాటు సామాజిక దృక్పథం కలిగిన విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు పడతాయన్నారు. పరిశుభ్రమైన వాతావరణం నెలకొన్నప్పుడే ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్, ఎన్‌సీసీ కేర్ టేకర్ కె.బాలగురవయ్య, ఎన్‌సీసీ సార్జంట్ కె.రామశేఖర్, అధ్యాపకులు, రెడ్‌క్రాస్ సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు తదితరులు పాల్గొన్నారు.



కళాశాల పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

ప్రజా వ్యతిరేకత ఉన్న ప్రాంతంలో మద్యం దుకాణం తగదు

రేపల్లె రూరల్: ప్రజా వ్యతిరేకత ఉన్న ప్రాంతాలలో మద్యం దుకాణాల ఏర్పాటు ప్రక్రియను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం, సీపీఐ, ఎంఆర్‌పీఎస్‌ల సంయుక్త ఆధ్వర్యంలో నాయకులు, ప్రజలు శుక్రవారం పేటేరు గ్రామంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పేటేరు 10వ వార్డులో మద్యం దుకాణం ఏర్పాటు చేసే ప్రదేశంలో నిరసన ప్రదర్శన చేసి పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు బాలాజీ మాట్లాడుతూ ప్రజా వ్యతిరేకత ఉన్నా అధికారుల అండదండలతో దుకాణం ఏర్పాటు చేయటం దుర్మార్గమైన చర్యన్నారు. మా గ్రామంలో మద్యం దుకాణాలు వద్దంటూ పేటేరు గ్రామ ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నా నిర్వాహకులు దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు సన్నాహం చేసుకోవటం బాధాకరమన్నారు. అధికారులు నిబంధనల ప్రకారం నడుచుకుని ప్రజా వ్యతిరేకత ఉన్న ప్రాంతాలలో దుకాణాల ఏర్పాటుకు అనుమతులు నిరాకరించాలన్నారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్, సీపీఐ నాయకులు నాగాంజనేయులు, ఎంఆర్‌పీఎస్ నాయకులు భాస్కర్, కిషోర్, బిక్షాలు తదితరులు పాల్గొన్నారు.



పేటేరు 10వ వార్డులో నిరసన కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ, ఎంఆర్‌పీఎస్ నాయకులు

వేమూరులో క్రెడిట్ క్యాంపు

వేమూరు: వెనుకబడిన వర్గాలకు రుణాలు అందజేసేందుకు ప్రభుత్వం క్రెడిట్ క్యాంపు నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో శివన్నారాయణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమూరు మండలంలోని పెరవలి, చావలి, వేమూరు, చదలవాడ, జంపని గ్రామాలకు చెందిన బ్యాంక్ మేనేజర్లు ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మండలంలోని బీసీ కార్పొరేషన్ రుణాలకు 90 మంది దరఖాస్తు చేయగా 78 మంది, కాపు కార్పొరేషన్‌కు 95 మంది దరఖాస్తు చేయగా 74 మంది క్రెడిట్ క్యాంపుకు హాజరయ్యారన్నారు. వైశ్యులు 9 మంది దరఖాస్తు చేయగా 8 మంది, కమ్మ 7 మందికి 6 మంది, ఈబీసీకి ముగ్గురు దరఖాస్తు చేయగా ఇద్దరు హాజరయ్యారని ఆయన తెలిపారు. మొత్తం 204 మంది దరఖాస్తు చేయగా 169 మందికి ఇంటర్వ్యూ చేయడం జరిగిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.




క్రెడిట్ క్యాంపులో ఎంపీడీవో, బ్యాంక్ మేనేజర్లు


• మేత కోసం వలస



వేమూరు: పశువుల మేత కోసం పల్నాడు నుంచి డెల్టా ప్రాంతం వలస వచ్చాయి. డెల్టా ప్రాంతంలో పశువులకు మేత ఉండటం వల్ల పల్నాడు ప్రాంతం పశువులు డెల్టా ప్రాంతానికి వలస వచ్చాయి. డెల్టా ప్రాంతంలో జొన్న, మొక్కజొన్న పంట పొలాలు ఖాళీ కావడంతో పశువులకు మేత పుష్కలంగా ఉంటుంది. డెల్టా ప్రాంతంలో మేత, తాగు నీరు పుష్కలంగా ఉండటం వల్ల పల్నాడు పశువులు డెల్టా ప్రాంతంలో మూడు నెలలు వరకు ఉంటాయి. మూడు నెలలు తర్వాత మరలా వెళ్లిపోతాయి.

నవోదయ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ





భట్టిప్రోలు: జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశ పరీక్షలో భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జనవరి 18న 6వ తరగతికి, ఫిబ్రవరి 8న 9వ తరగతికి ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మత్తి లక్ష్మి ప్రవస్తి (6వ తరగతి), బొంతా మోహనకృష్ణ సాయి (9వ తరగతి)కి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రధానోపాధ్యాయులు ఫణి పార్థసారథి, ఉపాధ్యాయులు అభినందించారు

క్రెడిట్ క్యాంపునకు 266 మంది హాజరు

కొల్లిపర: బీసీ కార్పొరేషన్ నుంచి సబ్సిడీ రుణాల మంజూరు నిమిత్తం శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. 20 గ్రామాల పరిధిలో 357 మంది దరఖాస్తు చేసుకోగా, 266 మంది హాజరైనట్లు ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు.

క్రెడిట్ క్యాంపులో ఎంపికైన లబ్ధిదారులకు రుణాలు

అమర్తలూరు(వేమూరు): క్రెడిట్ క్యాంపు ద్వారా ఎంపికైన బీసీ లబ్ధిదారులకు రుణాలు ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీవో మారుతీ శేషాంబ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. 121 మంది క్రెడిట్ క్యాంపుకు హాజరయ్యారని ఎంపీడీవో తెలియజేశారు. అర్హత ఉన్న వ్యక్తులను ఎంపిక చేసి రుణాలు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంక్‌ల మేనేజర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలి



బాపట్ల: విద్యుత్ సర్దుబాటు చార్జీలు తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్మార్ట్ మీటర్లు, సఖి ఒప్పందం, టైమ్ ఆఫ్ డే విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాపట్ల పాత బస్టాండ్ సెంటర్లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ధర్నాను ఉద్దేశించి గంగయ్య మాట్లాడుతూ విద్యుత్ భారాలు తగ్గించాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించి పగలగొట్టమని చెప్పిన టీడీపీ నాయకులు అవే మీటర్లు బిగించమని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై నాడు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి న్యాయస్థానంలో కేసు కూడా వేశారన్నారు. నాడు వైఎస్సార్‌సీపీని విమర్శించి నేడు అవే విధానాలు టీడీపీ అమలు చేస్తుందని ఈ అవకాశవాదాన్ని సీపీఎం తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. రాబోయే కాలంలో వీటికి వ్యతిరేకంగా ప్రజలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి మజుందార్, శరత్, రామారావు, బి.కొండయ్య, నూతలపాటి కోటేశ్వరరావు, వై.భాస్కరరావు, కే నాగేశ్వరరావు, సుభాషిణి, రాజేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

పండ్ల మార్కెట్ వేలం పాట వాయిదా

తెనాలి అర్బన్: పాటదారులు రాకపోవడంతో పురపాలక సంఘ పరిధిలోని పండ్ల మార్కెట్ వేలం పాట వాయిదా పడింది. మరలా నిర్వహించే వరకు పురపాలక సంఘ ఉద్యోగులు ఆశీలు వసూలు చేసేందుకు నిర్ణయించినట్లు మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్ తెలిపారు. గురువారం జరిగిన వేలం పాటలో కూరగాయల మార్కెట్‌ను రూ.12 లక్షలు, చేపలు, కోళ్లు, మాంసం మార్కెట్, జంతు వధశాలను రూ.4.78 లక్షలు, సత్యనారాయణ పార్కులోని పై అంతస్తులో క్యాంటీన్‌ను రూ.90వేలు, ఫుడ్ కోర్టు రూ.లక్ష, వెహికల్ పార్కింగ్ రూ.78వేలకు పాడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వేలం పాటల ద్వారా మున్సిపాలిటీకి రూ.19.46 లక్షల ఆదాయం సమకూరిందని ఆయన తెలియజేశారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలి అర్బన్: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.